క్లుప్తంగా

భూముల ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ఓబయ్య

కడప కోటిరెడ్డి సర్కిల్: దళిత భూములను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి బందెల ఓబయ్య కోరారు. కడప నగరంలోని ఆర్డీఓ కార్యాలయం పక్కన గురువారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాది కాలం నుంచి దళిత భూములను అగ్రవర్ణాలు ఆక్రమిస్తూ వచ్చారన్నారు. 15 ఏళ్లపాటు భూమికోసం పోరాటం చేస్తున్నామని, ఇప్పటికైనా వారికి న్యాయం చేయాలని ఆయన కోరారు. ఓబులేసు, రాముడు, వెంకటసుబ్బయ్య, బాలకృష్ణ, దివాకర్, వెంకటేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

సొంత మండలాల్లోనే నియమించాలి

కడప ఎడ్యుకేషన్: 2025–26 విద్యా సంవత్సరంలో ఎంటీఎస్‌పై ప్రభుత్వం నియమించిన 1998, 2008 సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను వారి సొంత మండలాల్లోనే నియమించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదిరెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నటు ఉపాధ్యాయులను దూర ప్రాంతంలో నియమించడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అనారోగ్య సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధులున్న ఉపాధ్యాయులను సొంత మండలంలో పాఠశాలలకు ఇచ్చేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

టీడీపీని మతతత్వ పార్టీగా మార్చే యత్నం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: టీడీపీని మతతత్వ బీజేపీగా మార్చేలా చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని డీసీసీ మాజీ అధ్యక్షుడు షేక్ నజీర్‌అహ్మద్ అన్నారు. కడప నగరంలోని తన కార్యాలయంలో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ ముస్లింలో రోజూ ఐదు పూటలా నమాజు చేసే భంగిమల్లో యోగాసనాలు ఉన్నాయని, కొత్తగా అంతర్జాతీయ యోగా డే పేరిట ముస్లింలకు ఆపాదించేందుకు కుట్ర చేయడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్ విద్యార్థులు, సిబ్బంది పాల్గొనాలని బలవంత పెడుతున్నట్లు తెలుస్తోందని, దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ముస్లింలకు అండగా ఉంటానని చెప్పిన చంద్రబాబు ఇపుడు ముస్లింల వ్యతిరేక పార్టీతో జతకట్టడం తగదన్నారు. యోగాడేలో ముస్లింలను మినహాయించాలని కోరారు.

20న రెవెన్యూ దినోత్సవం

కడప కోటిరెడ్డి సర్కిల్: రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమంలో రెవెన్యూ శాఖ కీలక పాత్ర పోషిస్తోందని ఏపీజేఏసీ అమరావతి వైఎస్సార్ కడప జిల్లా చైర్మన్ జీవన చంద్రశేఖర్, జనరల్ సెక్రటరీలు కృష్ణ కుమార్, రొనాల్డ్ శ్యామూల్ తెలిపారు. విలేకరులతో గురువారం వారు మాట్లాడుతూ ఈ నెల 20వ రెవెన్యూ దినోత్సవం నిర్వహిస్తున్నామని, ప్రతి రెవెన్యూ ఉద్యోగి, అధికారి పాల్గొని వేడుక ఘనంగా నిర్వహించాలని కోరారు.

నిరాశ్రయులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న సేవామూర్తులు

కడప అర్బన్: కడప నగరంలోని నబీకోట నివాసి తంగేడుపల్లి రమేష్‌బాబు పుట్టినరోజు సందర్భంగా హిమవర్షిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బృందా వృద్ధాశ్రమం, ప్రేమాలయ నిరాశ్రయుల నివాస వసతి గృహంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, రెడ్డి లక్ష్మణ్, వెంకటసురేష్‌బాబు, దామోదర్, టైలర్ రవి, గుండ్లకొండ శ్రీచరణ్, ఆశ్రమ నిర్వాహకులు బాలసుబ్బయ్య పాల్గొన్నారు.

అత్యున్నత స్థాయికి ఎదగాలి


మాట్లాడుతున్న సీఐ ఎస్‌కే రోషన్

కమలాపురం : ప్రతి విద్యార్థి మంచి క్రమశిక్షణ అలవరచుకుని అత్యున్నత స్థాయికి ఎదగాలని కమలాపురం సీఐ ఎస్‌కే రోషన్, ఎస్‌ఐ ఎ.విద్యా సాగర్ తెలిపారు. గురువారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సమాజం పట్ల బాధ్యతా యుతంగా, మంచి పౌరులుగా ఎదగాలన్నారు. తల్లిదండ్రుల ఆశల్ని, ఆశయాలను నెరవేర్చేలా మీ వంతు కృషి చేసి విజయం సాధించాలన్నారు. దేశ భవిష్యత్తు విద్యార్థులు, యువతపై ఆధారపడి ఉంటుందనే విషయాన్ని గుర్తించుకుని నడుచుకోవాలని సూచించారు. అలాగే పోక్సో యాక్ట్, పిల్లల భద్రత, బాల్య వివాహాలు, ఈవ్ టీజింగ్, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

సిలిండర్ గడువు దాటితే ముప్పు..!



కడప వైఎస్‌ఆర్ సర్కిల్: గ్యాస్ సిలిండర్‌తో వంట చేసుకోవడం ఎంత సులభమైన పద్ధతో.. సరైన జాగ్రత్తలు పాటించకపోతే అంతే ప్రమాదం ఉంటుంది. సిలిండర్‌కు కాల పరిమితి ఉంటుందని, దానిని గమనిస్తూ ఉండాలని నిపుణులు చెబుతున్నారు. గడువు ముగిసిన సిలిండర్‌ను వినియోగిస్తే గ్యాస్ లీక్ అయ్యే ప్రమాదం ఉంది. గ్యాస్ కంపెనీలు సరఫరా చేసే ప్రతి సిలిండర్‌పై గడువు తేదీ, కోడ్ విధానం మెటల్ ప్లేట్‌పై ముద్రిస్తాయి. సిలిండర్‌ను మార్చుకున్నప్పుడు తేదీ చూసి వినియోగించాలి.

ఇలా గుర్తించాలి.....

సిలిండర్ మెటల్ ప్లేట్‌పై ఎ–25, బీ–25 అని ఉంటే ఆ సిలిండర్ 2025 మార్చి–జూన్‌కి గడువు ముగుస్తుందని అర్థం. 25 అంటే 2025 సంవత్సరానికి, జనవరి నుంచి మార్చి వరకు ఆంగ్ల అక్షరం త్రైమాసికానికి సూచిక ‘ఎ’ ఉంటుంది. ‘బి’ అక్షరం ఏప్రిల్ నుంచి జూన్ వరకు, ‘సీ’ అక్షరం జులై నుంచి సెప్టెంబర్ వరకు ‘డీ’ అక్షరం అక్టోబర్‌నుంచి డిసెంబర్ వరకు అని గుర్తించాల్సి ఉంటుంది. సిలిండర్ ఇంటి వద్దకు వచ్చిన వెంటనే మెటల్ ప్లేట్‌పై కోడ్ విధానంలో ఉన్న గడువు తేదీ నెల వ్యవధిలో ముగుస్తున్నట్లు సిలిండర్‌పై ఉంటే దానిని తీసుకోరాదు. ఎందుకంటే చిన్న కుటుంబాల వారికి నెల రోజులకు పైగా గ్యాస్ వస్తుంది. ఆ సిలిండర్ స్థానంలో వేరే సిలిండర్‌ను అడిగి తీసుకునే హక్కు వినియోగదారుడికి ఉంది.

సిలిండర్‌కు పదేళ్ల గడువు

సిలిండర్ తయారైనప్పటి నుంచి పదేళ్ల గడువు ఉంటుంది. సిలిండర్‌ను ప్రత్యేకమైన ఉక్కుతో సిలిండర్ లోపల సురక్షితమైన కోటింగ్‌తో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) ప్రమాణాల మేరకు తయారుచేస్తారు. బీఐఎస్ అనుమతులు తీసుకున్న తర్వాతే నిలిండర్ మార్కెట్లోకి వస్తుంది.

వినియోగదారుల హక్కులు......

గ్యాస్ సిలిండర్ వినియోగారులకు హక్కులు ఉన్నాయి, గ్యాస్ కనెక్షన్ కలిగిన వినియోగదారుడు మృతిచెందితే వారి కుటుంబ సభ్యుల పేరిట ఆ కనెక్షన్ మార్చు చేసుకోవచ్చు. కొత్త కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే నిబంధనల మేరకు ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. అదే రోజు కనెక్షన్ పొందవచ్చు. కొత్త కనెక్షన్ తీసుకునే సమయంలో తమ వద్దనే స్టౌ కొనుగోలు చేయాలని డీలర్ కోరవచ్చు. డీలర్ వద్ద కొనుగోలు చేయాలన్న నిబంధన ఏమీ లేదు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న ఆర్టీసీ సిబ్బంది

కడప కోటిరెడ్డి సర్కిల్: కడప ఏపీఎస్‌ఆర్టీసీలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కోరారు. కడప డిపో సూపరింటెండెంట్ అల్లా బకాష్‌ను గురువారం వారు కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కండక్టర్లకు, డ్రైవర్లకు కొత్త చార్ట్ వేయాలని, ప్రతినెలా అర్హత ఉన్న వారందరికి అదే నెలలో సిక్ లీవ్‌లు మినహాయించుకుని పూర్తి జీతం ఇవ్వాలన్నారు. కేఎంపీఎల్ పేరుతో డ్రైవర్లను, కలెక్షన్ల పేరుతో కండక్టర్లను వేధించడం మానుకోవాలన్నారు. వార్షిక ఇంక్రిమెంట్లు, ఏఏఎస్ ఇంక్రిమెంట్లను లిటరసీ చెక్ పాసైన వారందరికీ ఇవ్వాలని కోరారు. అలాగే పొలతల, నిత్యపూజ కోనలో మూడు రోజులు పనిచేసిన ఉద్యోగులకు డీడీ అమౌంట్ త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్యారేజీలో రిటైర్డు అయిన వారి స్థానంలో స్కిల్డ్, అన్ స్కిల్డ్‌లను పరిగణలోకి తీసుకుని సీనియారిటీ ప్రాతిపదికన చార్ట్ వేయాలని కోరారు. కడప డిపోలో అసిస్టెంట్ మెకానికల్ ఫోర్‌మెన్ ఒక యూనియన్‌కు వత్తాసు పలుకడం మానుకోవాలన్నారు. కడప డిపోలో ఇద్దరు డ్రిమ్మర్స్, ఇద్దరు పెయింటర్స్‌ను కేటాయించేందుకు చొరవ తీసుకోవాలన్నారు. పై సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఈ నెల 24, 25వ తేదీలలో నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరవుతామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బాల వెంకటేష్, రఘురామ గౌడ్, ఏఎస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ సమావేశానికి పటిష్ట బందోబస్తు


కడప డీఎస్పీ ఎ.వెంకటేశ్వర్లు

కడప అర్బన్: కడప మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం(20వ తేదీన) జరిగే సర్వసభ్య సమావేశానికి పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఇద్దరు డీఎస్పీలు, 12మంది సీఐలు, 20 మంది ఎస్ఐలు, 53 మంది ఏఎస్ఐ/హెచ్‌సీలు, 110 మంది కానిస్టేబుళ్లు, నాలుగురు స్పెషల్ పార్టీలు బందోబస్తు విధుల్లో ఉంటారని కడప డీఎస్పీ వివరించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డ్రోన్ కెమెరా, నేత్రా, వజ్ర వాహనం ద్వారా నిఘా ఉంచుతామని తెలిపారు. ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు.

రిమ్స్ రోడ్డుకు మరమ్మతులు


మరమ్మతులకు ముందు


మరమ్మతుల తర్వాత

కడప నగరంలోని పాత రిమ్స్ రోడ్డు అధ్వాన స్థితిలో ఉందని ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రహదారిపై మట్టి వేసి మరమ్మతులు చేపట్టారు. చిప్స్ వేసి నూతన సీసీ రోడ్డు వేయనున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

యోగాంధ్రను విజయ వంతం చేయండి

కమలాపురం : పట్టణంలోని బాలయోగి గురుకుల పాఠశాలలో ఈనెల 21వ తేదీన నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ గౌస్‌బాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు 11వ అంతర్జాతీయ యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాలు, అన్ని శాఖల అధికారులు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, సిబ్బంది హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

చింతకొమ్మదిన్నె : మండలంలోని అన్ని సచివాలయాలలో జూన్ 21 ఉదయం 6.30 గంటల నుంచి 8.00 గంటల వరకు యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహించాలని సచివాలయ కార్యదర్శులను ఆదేశించినట్లు ఎంపీడీఓ కుల్లాయిబాబు తెలిపారు.

వల్లూరు (చెన్నూరు) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈనెల 21న ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే ఉద్దేశంతో యోగ పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. చెన్నూరు మండల వ్యాప్తంగా తొమ్మిది సచివాలయాలు ఉన్నాయని, ప్రతి సచివాలయ పరిధిలో 9 ప్రాంతాలలో యోగ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మండల వ్యాప్తంగా 9 సచివాలయాల పరిధిలో 81 ప్రాంతాలలో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు.

వీరపునాయునిపల్లె : స్థానిక సంగమేశ్వర ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 21వ తేదీన నిర్వహించే యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేకధికారి మల్లికార్జున ప్రసాద్ తెలిపారు. యోగా కార్యక్రమం నిర్వహించేందుకు చేస్తున్న ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు.

మామిడి రైతులను ఆదుకోవాలి

సిద్దవటం : గిట్టుబాటు ధర లేక మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారని ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవాలని వైఎస్‌ఆర్‌సీపీ సీనియర్ నాయకుడు సింగం క్రిష్టారెడ్డి కోరారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాతూ మామిడి కాయలు చెట్లకే మాగి పురుగులు పడుతున్నాయన్నారు. ధరల పతనం కావడంతో మామిడినే నమ్ముకున్న రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. గత ఏడాది ఎకరాకు రూ.50వేలు వచ్చిందని, ఈ ఏడాది ఎకరాకు రూ.10వేలు కూడా రాలేదని రైతులు వాపోతున్నారన్నారు. బేనిషా రకానికి చెందిన పండ్లు కిలో రూ.30 అడుగుతున్నారన్నారు. మామిడి కాయ పక్వానికి వచ్చి మాగిపోయి పురుగులు పడుతున్నాయన్నారు. మామిడిని నమ్ముకున్న రైతులు తోటలోనే కుళ్లిపోతున్న కాయలను చూసి రైతులు కుమిలి పోతున్నారన్నారు. పెట్టిన పెట్టుబడులు రాక చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియని దుస్థితిలో మామిడి రైతులు ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

యోగాతో ఇంటిల్లిపాదికీ ఆరోగ్య భాగ్యం

నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి


మాట్లాడుతున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి


యోగా చేస్తున్న పాత్రికేయులు, కుటుంబ సభ్యులు

కడప సెవెన్‌రోడ్స్: దినచర్యలో యోగా ఒక భాగంగా మారితే ఇంటిల్లిపాదికీ ఆరోగ్యం సొంతమవుతుందని కడప నగర పాలక సంస్థ కమిషనర్ మనోజ్ రెడ్డి పేర్కొన్నారు. యోగాంధ్ర మసోత్సవాల్లో భాగంగా కడప స్టేట్ గెస్ట్ హౌస్ ఎదుట మీడియా ప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులతో గురువారం ‘ఫ్యామిలీ యోగా’ కార్యక్రమం నిర్వహించారు. కడప నగరపాలక సంస్థ, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ‘ఫ్యామిలీ యోగా’ కాన్సెప్ట్ మీడియా మిత్రుల్లో నూతనోత్సాహం నింపిందన్నారు. ఒక్కో కుటుంబానికి చెందిన పిల్లలు, తల్లిదండ్రులు, గ్రాండ్ పేరెంట్స్ హాజరై యోగాసనాలు వేయడం.. గర్వించదగ్గ విషయం అన్నారు. యోగాసనాలు వేయడం ద్వారా క్రమశిక్షణ, మెరుగైన జీవన విధానం అలవడుతుందన్నారు. యోగా సాధనతో మానసిక సమస్యలకు, శారీరక రుగ్మతల నుంచి విముక్తి లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొనాలని కోరారు. అంతకు ముందు యోగా ట్రైనర్లు కార్యక్రమానికి హాజరైన వారితో ప్రోటోకాల్ ప్రకారం యోగాసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ డీపీఆర్వో పద్మజ, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రాకేష్ చంద్ర, జిల్లాకు చెందిన అన్ని మీడియా మిత్రుల కుటుంబాల సభ్యులు, పలువురు ఉద్యోగులు, ఎన్జీవో ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యోగాసనాలతో ఆరోగ్యం

కడప ఎడ్యుకేషన్: యోగాసనాల అభ్యాసంతో ఆరోగ్యం కలుగుతుందని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సూర్యారావు అన్నారు. యోగాంధ్ర మాసోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి గోవిందరెడ్డి ఆధ్వర్యంలో గురువారం యోగాభ్యసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కడప ప్రభుత్వ డిగ్రీ కళాశాల పదవీ విరమణ అధ్యాపకులు ఆదినారాయణ ఆసనాలు, వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. గోవిందరెడ్డి మాట్లాడుతూ యోగా చేయడం వల్ల మంచి ఆరోగ్య పుష్టి లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అరుణకుమారి, శ్రీనివాసులురెడ్డి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఆసనాల గురించి వివరిస్తున్న ఆదినారాయణ

బాలుర జూనియర్ కళాశాలలో...

కడప నగరంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో యోగాసనాల కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ జ్ఞానేశ్వరి మాట్లాడుతూ యోగాంధ్ర గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. యోగా గురువు తెలుగు అధ్యాపకులు చంద్రమౌళి అమృతరాజు మాట్లాడుతూ యోగా నిత్యం చేయడంతో శారీరక దృఢత్వం, మానసిక ఆరోగ్య స్థితి బాగుంటుందన్నారు. అనంతరం విద్యార్థులతో ఆసనాలు వేయించారు. హబీబుల్లా, రాజారావు, శ్రీరాముల రెడ్డి, యోగేశ్వరరెడ్డి, సుజాత, పద్మావతి, రోజమ్మ, సుధాకర్‌రాజు, హరికృష్ణ, విద్యావతి పాల్గొన్నారు.


యోగ గురించి వివరిస్తున్న ప్రిన్సిపల్ జ్ఞానేశ్వరి

కార్పొరేట్ విద్యా సంస్థలలో ఫీజుల దోపిడీ



ఆందోళన చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలోని కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బత్తల అరుణ్ అన్నారు. ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు జి.వలరాజు, నాసర్, సాయికుమార్‌లపై పోలీస్ దాడిని ఖండిస్తూ కడప నగరంలోని శ్రీచైతన్య విద్యా సంస్థల ఎదుట గురువారం ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ఆందోళన చేపట్టారు. అరుణ్ మాట్లాడుతూ శ్రీచైతన్య విద్యా సంస్థల్లో అడ్మిషన్స్, పుస్తకాలు, టై, బెల్ట్, షూస్ పేరిట లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థల యాజమానులు 90 శాతం పైగా ఎన్డీఏ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల వ్యాపారాన్ని జిల్లా అధికారులు అరికట్టాలన్నారు. అకీరానందన్, అశోక్, రాజేష్, సాగర్, అభిరామ్ పాల్గొన్నారు

కేవీకే విద్యార్థులకు తల్లికి వందనం కొనసాగించాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కేవీకే విద్యార్థుల తల్లిదండ్రులు

కడప కోటిరెడ్డి సర్కిల్: కేంద్రీయ విశ్వవిద్యాలయం విద్యార్థులకు తల్లికి వందనం కొనసాగించేలా చూడాలని కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, కడప మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ రాకేష్‌లకు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తమకు అమ్మఒడి వచ్చేదని, ప్రస్తుత ప్రభుత్వంలో తల్లికి వందనం రాలేదన్నారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమ బిడ్డలకు న్యాయం చేయాలని తల్లిదండ్రులను వారు కోరారు. విద్యా శాఖ కార్యదర్శి కోనశశిధర్, డైరెక్టర్ విజయ రామరాజు, డీఈఓలతో శ్రీనివాసులురెడ్డి ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో పేరెంట్స్ అసోసియేషన్ కోశాధికారి జితేంద్ర, కన్వీనర్ జయదుర్గాప్రసాద్, శామ్సన్, అనిల్, కో కన్వీనర్లు జాఫర్, నరసింహులు, మునీంద్ర, లక్ష్మీ, రమ్య, సౌందర్య, సుబ్బారావు, నాగేంద్ర, నాగరాజు, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే పిల్లలకు మంచి భవిష్యత్తు


మాట్లాడుతున్న శివారెడ్డి

కడప కోటిరెడ్డి సర్కిల్: విద్యతోనే పిల్లలకు మంచి భవిష్యత్తు ఉంటుందని జేఎస్‌ఓఎస్ వ్యవస్థాపకుడు శివారెడ్డి పేర్కొన్నారు. కడప ప్రకాష్ నగర్‌లో గురువారం జేబీవీఎస్ ది ప్రిజర్వర్ సేవా సమితి ఆధ్వర్యంలో సమ్మర్ ఎడ్యుకేషనల్ క్యాంప్ ముగింపు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ చిన్నారులలో నూతన ఆలోచనలు, జ్ఞానం, నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి కృషి చేసిన జేబీవీఎస్ సంస్థ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్ అశోక్ మాట్లాడుతూ ఒక విద్యార్థి చదువుకుంటే ఒక తరాన్ని మార్చగలిగే శక్తి ఆ విద్యార్థికి ఉంటుందన్నారు. చిన్న వయస్సు నుంచే విద్యను సరైన మార్గంలో అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సుబ్బయ్య, ప్రేమానందం, విష్ణు, భాస్కర్, భవాని, తదితరులు పాల్గొన్నారు.

పెరటికోళ్ల పెంపకంతో రైతులకు ఆదాయం


మాట్లాడుతున్న కేవీకే సమన్వయకర్త వీరయ్య

కడప అగ్రికల్చర్: పంటలసాగుతోపాటు పెరటి కోళ్ల పెంపకం రైతులకు అదనపు ఆదాయాన్ని సమకూరుస్తుందని కృషి విజ్ఞాన కేంద్ర సమన్వయకర్త డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. కడప నగర శివార్లలోని ఊటకూరు కేవీకేలో పెరటికోళ్ల పెంపకంపై రైతులకు గురువారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవీకే నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని, శిక్షణ పొందిన తర్వాత ఆసక్తితో ఆచరణలోకి తీసుకురావాలని తెలియజేశారు. పెరటకోళ్ల పెంపకం ఆహార భద్రతను కాపాడుతుందన్నారు. పశు విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ సురేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పెరటి కోళ్లలో వచ్చే వ్యాధులు, నివారణ చర్యలు, టీకాల ప్రాముఖ్యత, యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. మహిళా రైతులు కోళ్ల పెంపకాన్ని ఉపాధిగా చూడాలని తెలిపారు. ఇందులో భాగంగా 500 కోళ్లను, కోళ్లకు సంబంధించిన మందులను రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ప్రశాంతి, శిల్పకళ, సాయి మహేశ్వరి, మహేష్‌బాబు, మానస, గిరిష్‌కుమార్‌తోపాటు రైతులు పాల్గొన్నారు.

నగరపాలక పాఠశాలల్లో వలంటీర్లను నియమించాలి


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు


కడప ఎడ్యుకేషన్: కడప నగరపాలక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చేందుకు విద్యా వలంటీర్లను నియమించాలని ఎస్టీయూ నగరపాలక శాఖ నాయకులు కోరారు. నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డిని గురువారం వారు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా నగరపాలక సంస్థ విద్యా వాలంటీర్లను నియమంచి ఉపాధ్యాయుల కొరత లేకుండా చేసిందన్నారు. ఏపీ ప్రభుత్వం నగరంలో ఐదు పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా తీర్చిదిద్దిందని, విద్యా వలంటీర్ ద్వారానే బోధన సాధ్యమైందని తెలిపారు. సబ్జెక్ట్ టీచర్ల కొరత లేకుండా చూడాలని కోరారు. కమిషనర్ స్పందిస్తూ ఈ ఏడాది విద్యా వలంటీర్లను నియమిస్తామని తెలిపారు. ప్రధానోపాధ్యాయుల ద్వారా వాలంటీర్ల జాబితా అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా, రాష్ట్ర మున్సిపల్ కన్వీనర్ రవిశంకర్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, సాధిక్, సంజీవరాయుడు, బాబు పద్మాకర్, అనిల్‌కుమార్, రాజగోపాల్‌రెడ్డి, నాజిబుల్ల, జుబైర్ అహమద్, సునీల్, నగర నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాగ్రత్తల పాటింపుతోనే జ్వరాల నివారణ


జ్వరాలపై అవగహన కల్పిస్తున్న వైద్యాధికారులు

సిద్దవటం : సీజనల్ జ్వరాలపై అవగాహన తెచ్చుకొని జాగ్రత్తలు పాటించాలని పి. కొత్తపల్లె పిహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ రంగలక్ష్మి, మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు విద్యార్థులకు సూచించారు. గురువారం సిద్దవటం మండలంలోని టక్కోలు జెడ్పీహెచ్‌ఎస్‌లో సీజనల్ జ్వరాలపై అవగాహన కల్పించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి మాట్లాడుతూ అపరిశుభ్రత ప్రాంతాల్లో ఉండే చోట దోమలు ఉత్పత్తి చెంది దోమలు కుట్టడం వల్ల మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి విషజ్వరాలు సోకుతాయని మలేరియా జ్వరం వస్తే చాలా ప్రమాదమని, మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. ఇంటి చుట్టూ చెత్తాచెదారం నిల్వలు లేకుండా చూడాలని దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. అలా చేయడం వల్ల నీళ్లలో దోమలు గుడ్లు పెట్టకుండా తద్వారా అవి దశలవారీగా లార్వా, ప్యూపా దోమగా అభివృద్ధి చెందకుండా ఉంటాయన్నారు. విద్యార్థులు ఆహారం తీసుకునేటప్పుడు, చేతులు శుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నరసమ్మ, సూపర్‌వైజర్ మౌలాలి, ఎంఎల్‌హెచ్‌పీ ప్రవల్లిక, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్‌లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● కరవు ఛాయలు



రాష్ట్రంలో నైరుతి పవనాలు ముందుగా వచ్చినానా ఆకాశంలో మేఘాలు వర్షించడం లేదు. ఊరిస్తున్న వర్షాలు అరకొర వర్షపు జల్లులకు రైతులకు వరి నాటేందుకు ధైర్యం చాలడం లేదు. భూమిలో నీరు లేక.. పొలం దుక్కులు చేసి ఇలా బీడుగా వదిలేశారు. గత ప్రభుత్వం రైతుకు భరోసా కల్పించేలా సొమ్ము సమకూర్చింది. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రైతులకు పెట్టుబడులు బరువయ్యాయి. ఈ నేపథ్యంలో కమలాపురం–ఎర్రగుంట్ల మధ్య బీడుగా వదిలేసిన పొలం ఇదీ..

– సాక్షి ఫొటోగ్రాఫర్, కడప